PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 179 | 11 ఆదివారం అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- ఢిల్లీలో ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం
- యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ
- మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు
- ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

2 లో

# రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి..!

## ఈసీకి మద్దతుగా మాజీ ఉన్నతాధికారుల ఘాటు లేఖ

- ఎన్నికల సంఘానికి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు
- రిగ్గింగ్ ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని స్పష్టీకరణ
- గతంలో బూత్ కబ్జాలు చూశాం, నేటి వ్యవస్థ పటిష్టంగా ఉందని వెల్లడి
- మీకు విజయాలిచ్చిన వ్యవస్థపైనే ఇప్పుడు అనుమానమా అని ప్రతిపక్షాలకు ప్రశ్న
- నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచవద్దని హితవు




భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఎన్నికల ప్రక్రియలపై ప్రతిపక్షాలు చేస్తున్న 'రిగ్గింగ్' ఆరోపణలపై 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘాన్ని సమర్థిస్తూ, భారత పౌరులను ఉద్దేశించి వారు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల అక్రమాలపై చేసే ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలు ఉండాలని, నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. ...మిగతా 2 లో...



## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

- ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ
- అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టీకరణ
- మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య
- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు
- రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి

# తమిళనాట ఆసక్తికరం...

### కాఫీ తాగుతూ కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ ముచ్చట్లు

- తమిళనాడు సీఎం విజయ్‌తో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భేటీ
- విజయ్ నివాసంలో గంటపాటు సమావేశమై రాజకీయాలపై చర్చ
- ఓ కేఫ్‌లో కాఫీ తాగుతూ ప్రజలతో కలిసి సెల్ఫీలు దిగిన నేతలు
- తమిళనాడులో కాంగ్రెస్-టీవీకే కూటమి నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యంద



తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్.. వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమన్వయానికి అద్దం పట్టింది. శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. ...మిగతా 2 లో...

# సీఈసీ వివాదం...

### ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు.



...మిగతా 2 లో...

### ధ్రువ్ రాఠీని అదుపులోకి తీసుకున్న పోలీసులు..

# ఢిల్లీలో హై అలర్ట్..!

- ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని తన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శనివారం ఉదయం 8 గంటలకు ఈ ఘటన జరిగినట్లు సీజేపీ వెల్లడి
- జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిరసనలో పాల్గొనేందుకు వెళ్లనున్న నేపథ్యంలో చర్యలు
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా బెంగళూరులోనూ నిరసనలో పాల్గొన్న రాఠీ
- ఢిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు సిద్ధమవుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు ఈ మేరకు అరెస్ట్ చేసినట్లు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. అయితే, ఆయనను అదుపులోకి తీసుకోవడానికి గల కారణాలపై స్పష్టత లేదు. ...మిగతా 2 లో...





## హైదరాబాద్ హైస్పీడ్ రైల్..

### భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

# పట్టిసీమ ఫలం..

## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

- పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు
- చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు
- పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ...మిగతా 2 లో...



ప్రజాసీమ

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

మొదటిపేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు.గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు."మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు.ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

# రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి..!

మొదటిపేజీ తరువాయి

'ఓట్ల చోరీ' జరుగుతోందంటూ ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న తరుణంలో ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో శనివారం జరిగిన ఆందోళనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో మాజీ అధికారులు స్పందిస్తూ, "మేం ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదు. దశాబ్దాల పాటు మా సర్వీసులో ఎన్నికల నిర్వహణను దగ్గరుండి చూశాం. ఓటర్ల జాబితా రూపకల్పన నుంచి ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వరకు క్షేత్రస్థాయిలో పనిచేశాం. ఎటువంటి ఆధారాలు లేకుండా 'రిగ్గింగ్' అనే పదాన్ని ఎన్నికలపై విసరడం మనందరి ప్రజాస్వామిక విశ్వాసాన్ని గాయపరుస్తుంది," అని లేఖలో పేర్కొన్నారు.గతంలోని పరిస్థితులను గుర్తుచేస్తూ, "రిగ్గింగ్ ఎన్నికలు ఎలా ఉంటాయో మాకు బాగా తెలుసు. ఒకప్పుడు సినిమాల్లో చూపించినట్లు బూత్‌ల వద్ద కత్తులు, బాహుబలుల దౌర్జన్యాలు, బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం వంటివి చూశాం. బూత్ కబ్జాలు సర్వసాధారణం కావడంతో 1989లో పార్లమెంట్ దీన్ని తీవ్రమైన నేరంగా ప్రకటించింది" అని వివరించారు.నేటి ఎన్నికల వ్యవస్థ పటిష్ఠతకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనమని వారు తెలిపారు. "ఒకప్పుడు బూత్ కబ్జాలకు మారుపేరైన బిహార్‌లో 2025 ఎన్నికల్లో ఒక్కచోట కూడా రీ-పోలింగ్ జరగలేదు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం. 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. మహిళలు రికార్డు స్థాయిలో ఓటేశారు. ఇది అధికారులు సాధువులుగా మారడం వల్ల జరగలేదు. ఈసీ రూపొందించిన పటిష్ఠ వ్యవస్థ వల్లే సాధ్యమైంది" అని ప్రశంసించారు.ప్రస్తుత ప్రక్రియలో ప్రతి బూత్‌లోనూ అభ్యర్థుల ఏజెంట్లు ఉంటారని, పోలైన ఓట్లపై సంతకాలు చేసి పత్రాలు తీసుకుంటారని, ఏజెంట్ల సంతకాలతోనే మెషీన్లను సీల్ చేసి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారని వివరించారు. రిగ్గింగ్ జరగాలంటే వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలకు చెందిన వేలాది మంది అధికారులతో పాటు, ఓడిపోయిన పార్టీల ఏజెంట్లు కూడా మౌనంగా ఉండాలని, అంత పెద్ద కుట్ర ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలను ఉద్దేశించి "మీరు రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తున్న వ్యవస్థే మీకు గతంలో విజయాలను అందించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీరు వ్యవస్థను అనుమానిస్తున్నారా? కేవలం ఫలితాన్ని మాత్రమేనా? ప్రజలచే తిరస్కరణకు గురైన తర్వాత నిరాధార ఆరోపణలతో ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా తమ ఉనికిని కాపాడుకోవాలని చూడటం సరికాదు" అని వారు ఘాటుగా విమర్శించారు.

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు."రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం.మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది.ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# ధ్రువ్ రాఠీని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఢిల్లీలో హై అలర్ట్..!

మొదటిపేజీ తరువాయి

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాఠీ సిద్ధమయ్యారు. గురువారం బెంగళూరులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలోనూ ఆయన పాల్గొన్నారు.సీజేపీ ఎక్స్ ఖాతాలోని సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం 8 గంటల సమయంలో సుమారు 50 మంది పోలీసులు సాధారణ దుస్తుల్లో రాఠీ నివాసానికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు.సీజేపీ నిరసన నేపథ్యంలో దేశ రాజధానిలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ సరిహద్దుల్లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిరసన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు బాడీ కెమెరాలు అందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసాల వద్ద కూడా భద్రతను పెంచారు.ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా సుప్రీంకోర్టు, మండీ హౌస్ సహా పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు. నిరసన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించేందుకు దక్షిణ ఢిల్లీ డీసీపీ అనంత్ మిత్తల్ ఆయా నగర్ సరిహద్దుకు చేరుకున్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు.అనధికార వ్యక్తులు న్యూఢిల్లీకి రాకుండా అడ్డుకుంటున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామని అనంత్ తెలిపారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోనూ డ్రోన్లతో నిఘా కొనసాగుతోంది. ఢిల్లీ పోలీసులు, 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బందిని మోహరించారు. భద్రతా కవాతులు నిర్వహిస్తున్నారు.

# తమిళనాట ఆసక్తికరం...

## కాఫీ తాగుతూ కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ ముచ్చట్లు

మొదటిపేజీ తరువాయి

తూర్పు తీర రహదారి వెంట ప్రశాంతంగా ఉండే నీలంకరై ప్రాంతంలో ప్రారంభమైన ఈ భేటీ, అనంతరం సమీపంలోని ఒక కేఫ్‌కు మారింది. అక్కడ ఇద్దరు నేతలు క్యాపిచినో, టిరమిసు, కుకీలు ఆస్వాదిస్తూ.. సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నమైన వాతావరణంలో గడిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కేఫ్ వద్దకు చేరుకున్నారు. రాహుల్, విజయ్ వారితో సరదాగా ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.కేఫ్ నుంచి నిష్క్రమించిన అనంతరం రాహుల్ గాంధీ నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్నారు. యువత కోసం ఉద్దేశించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' తాజా ఎడిషన్‌లో పాల్గొనేందుకు ఆయన చెన్నై పర్యటనకు వచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు వ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# సీఈసీ వివాదం...

## ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

మొదటిపేజీ తరువాయి

"రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

# కురుమూర్తి స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులు..

ప్రజాసీమ:

తెలంగాణ రాష్ట్రంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారిని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులు అందరూ కూడా దర్శించుకున్నారు. లక్ష్మి సహస్ర జన్మదిన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి అక్కడున్న అర్చకులు ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. తదుపరి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవిత, కుమారుడు కూతురు పాల్గొన్నారు.

# పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## పాల్తేరులో 50 లక్షల నిధులతో నిర్మిస్తోన్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన కూటమి పార్టీల నాయకులు

**ప్రజాసీమ::**

మండలంలోని పాల్తేరు పంచాయతీ, అంకంపేటలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంజూరు చేసిన 50 లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తోన్న సిసి రోడ్లు నిర్మాణానికి శుక్రవారం కూటమి పార్టీల నాయకులు శంకుస్థాపన చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పాయకరావుపేట పిఎసిఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి గెడ్డం బుజ్జి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్ (పద్దు), పట్టణ శాఖ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొందు కాశీ విశ్వనాథ్, క్లస్టర్ ఇంచార్జి వంకా రమణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎగదాసు నానాజీ, తెలుగుదేశం పార్టీ పాల్తేరు గ్రామ శాఖ అధ్యక్షులు కొంకుపూడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మాకినీడి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకులు అనిశెట్టి వెంకటసూరి (శ్రీను), జనసేన పార్టీ సీనియర్ నాయకులు అక్కిరెడ్డి వరహాలు, ఉప సర్పంచ్ దేవవరపు శివరాజు,



మాజీ ఉప సర్పంచ్ రాంబాబు, సుబ్రమణ్యం, బుద్దాల శ్రీను, ఇసరపు తాతారావు, మాకినీడి సత్తిబాబు, ఘనశాల గంగేశ్వరరావు, ముద్దాల వీరబాబు, పెదకాపు గోపి, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్మెంట్ పై అవగాహన కార్యక్రమం

**ప్రజాసీమ:**

తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో శుక్రవారం ఉమెన్ ఎంపవర్మెంట్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆడపిల్లల్లో సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వలన వచ్చే పౌష్టికాహార లోపాలు, నివారణ చర్యలు గురించి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ లలిత మాట్లాడుతూ... ఆడపిల్లలు సమతుల్య ఆహారం తీసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని విద్యార్థినులకు తెలియజేశారు. అనంతరం "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్లపురం జి.హెచ్.డి.డాక్టర్. ఎమ్. వెంకటలక్ష్మి, అల్లిపూడి జి.హెచ్.డి.డాక్టర్. సత్యవేణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి వారి సమస్యలకు చక్కని పరిష్కారాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల కోసం ఉచిత హోమియో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులకు మెడికల్ చెక్ అప్ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అలీన.పి.వి.కె.ఎమ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. దివాకర్, ఎం శ్రీనివాస్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితం

**పర్చూరుకు 90 టన్నుల పశువుల దాణా మంజూరు**

**తీవ్ర వర్షాభావ నేపథ్యంలో పశు పోషకులకు ఊరట**

**పశుసంపద పరిరక్షణకు ప్రాధాన్యం.. రైతులకు అండ**

**నియోజకవర్గ పశుపోషకుల సంక్షేమానికి మరో ముందడుగు**

**ప్రజాసీమ:**

పల్లెల్లో పశువంటే కేవలం ఆదాయ వనరు కాదు, ఇంట్లో మనిషితో సమానం. తెల్లవారుజామున పాలధారై, కష్టకాలంలో కుటుంబానికి ఆసరాగా నిలిచే ఆ మూగజీవాలు ఆకలితో అలమటిస్తుంటే రైతు గుండె తల్లడిల్లుతుంది. వానలు కరవై, కరవు ఛాయలు అలుముకున్న ఈ వేళ.. అలాంటి పశు పోషకులకు ఊరటనిస్తూ కూటమి సర్కార్ పర్చూరు నియోజకవర్గానికి అదనంగా 90 టన్నుల పశువుల దాణా మంజూరు చేసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ కేటాయింపు చేసింది.ఎల్‌నినో ప్రభావ,పరిస్థితుల్లో ఇది పశు పోషకులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

వర్షాభావంతో తీవ్రమైన దాణా కొరతనియోజకవర్గంలో అత్యధికులు పశు సంపద ద్వారా వచ్చే ఆదాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే వర్షాలు కురవకపోవడం, ఇటీవలి పర్యావరణ, ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో నాణ్యమైన దాణా, పచ్చిమేత కొరత తీవ్రమైంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దాణా పశువుల పోషకాహార అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. సరైన పోషణ లేక పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది. పాడి పశువుల్లో ఆరోగ్య సమస్యలు పెరగడమే కాకుండా, వ్యాధుల బారిన పడే ప్రమాదమూ అధికమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం పశుపోషకుల జీవనోపాధికి ఊతమివ్వనుంది.మంత్రికి ఎమ్మెల్యే లేఖ.. వెంటనే స్పందన ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు లేఖ రాశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలైన మార్టూరు, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, యద్దనపూడిలకు ఒక్కో మండలానికి 15 టన్నుల చొప్పున మొత్తం 90 టన్నుల అదనపు దాణా మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి అదనపు దాణాను మంజూరు చేశారు. పశు సంపద పరిరక్షణకు ప్రాధాన్యం కరవు పరిస్థితుల్లో పశువులను కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారిన తరుణంలో, ఈ దాణా మంజూరు వారికి పెద్ద ఆసరాగా నిలవనుంది. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాల ఉత్పత్తి పెరిగి, పశుపోషకులకు గణనీయమైన ఊరట లభించనుంది. పాడి రైతు నిలబడితేనే పల్లె ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందన్న నమ్మకంతో, పశుపోషకుల ప్రయోజనాలే



లక్ష్యంగా, రైతన్నకు అండగా ఎమ్మెల్యే ఏలూరి చేసిన ఈ కృషి నియోజకవర్గ పశుపోషకుల సంక్షేమానికి మరో ముందడుగుగా నిలిచింది.దాణా మంజూరు పట్ల పశు పోషకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరుతడి పంటగా మినుము సాగు

**రైతులకు 80 శాతం సబ్సిడీపై మినుములు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**

**ప్రజాసీమ:**

ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు 80 శాతం సబ్సిడీపై మినుములను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈరోజు నుండి రైతు సేవా కేంద్రాల్లో 80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్‌లో పంట సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. చీరాల వేటపాలెం మండలానికి 412 క్వింటాళ్ల మినుము విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు.కిలో విత్తనం పూర్తి ధర రూ.129.50 కాగా, ప్రభుత్వం రూ.103.60 సబ్సిడీ అందిస్తుందని,రైతు వాటాగా కేవలం రూ.25.90 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మినుము సాగు చేయదలచిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని ఆధార్ కార్డు,పట్టాదార్ పాస్ పుస్తకంతో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కౌతరపు జనార్ధన్, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా దసరా సంబరాలు

**ప్రజాసీమ::**

పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శుక్రవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విజయదశమి పండుగ విశిష్టత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అమ్మవారి వివిధ రూపాలను ప్రతిబింబించేలా సంప్రదాయ వేషధారణలో అందంగా ముస్తాబై, అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో అలరించారు. చిన్నారుల నృత్యాలు, ఆటపాటలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి..ఈ వేడుకల్లో భాగంగా ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తీసుకువచ్చి అందంగా ప్రదర్శించడంతో బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ పద్ధతిలో బొమ్మలను అలంకరించి ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. చిన్నారుల్లో సృజనాత్మకతను, భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తిని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎజిఎం ఎంవి సురేష్, ఆర్ఐ పి గోపీనాథ్, మాట్లాడుతూ... పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ తమలోని ప్రతిభను వెలికితీయాలని తెలిపారు. ప్రిన్సిపల్



పి రామరాజు మాట్లాడుతూ... విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకొని వాటిని గౌరవించాలన్నారు.

## ఎంపి గొల్ల బాబూరావును ఘనంగా సత్కరించిన హిందుస్థాన్ షిప్ యార్డ్ సిఎండిఓ చంద్రశేఖరన్ రఘురాం

**పజాసీమ:**

పార్లమెంట్ సభ్యులు (రాజ్యసభ) గొల్ల బాబూరావు ఇటీవల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మెంబరుగా నియమితులైన సందర్భంగా హిందుస్తాన్ షిప్ యార్డ్ సిఎండిఒ చంద్రశేఖరన్ రఘురాం విశాఖపట్నంలోని గొల్ల బాబూరావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావుకు శాలువా కప్పి సత్కరించారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. తనను ఘనంగా సత్కరించిన హిందుస్తాన్ షిప్ యార్డ్ సిఎండిఒ చంద్రశేఖరన్ రఘురాంకు గొల్ల బాబూరావు కృతజ్ఞతలు తెలియజేశారు.



# రైతులు హలాన్ని పట్టుకోవాలి అర్జీలు కాదు

**రాజముద్రతో భూమికి భరోసా కల్పించాం**

**ఇప్పటికి 40.58 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ**

**16.48 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు**

**కొండపిలో 2,915 ఎకరాల గర్భకండ్రిక భూ సమస్యల పరిష్కారం**

**ప్రకాశం జిల్లా మీ భూమి-మీహక్కు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు**

**రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన**

**ప్రజాసీమ:**

రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలే తప్ప.. భూమి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూమి రైతుదేనని, దానిపై హక్కు కూడా రైతుదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో హక్కులను పరిరక్షించేందుకు రీసర్వే ప్రక్రియను చేపట్టామని తెలిపారు. రీసర్వే 2.0 అనంతరం రాజముద్రతో కూడిన పటిష్టమైన భద్రతా ఫీచర్లతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలనుపుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' గ్రామసభలో ఆయన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. గత పాలనలో భూములకు భద్రత లేకుండా పోయిందని, ఆక్రమణలు, దందాలు, భూ వివాదాలతో రెవెన్యూ వ్యవస్థను దెబ్బతీశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకుని, సర్వే రాళ్లపై రాజకీయ నాయకుల బొమ్మలు పెట్టారని వ్యాఖ్యానించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో భూములపై వివాదాలు సృష్టించారని, అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. గతంలో రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్నవారి భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 16.48 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని వెల్లడించారు. కంగుంది, అమలాపురం, శెట్టిపల్లి తదితర ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న 41 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని చెప్పారు. ప్రకాశం జిల్లాలో నాలుగు మండలాల్లోని 2,315 ఎకరాల గర్భ కండ్రిక భూముల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు. పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకే ప్రతినెలా ప్రజల ముందుకు వస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం సక్రమంగా పూర్తయ్యేంత వరకూ రైతుల వద్దకు వస్తూనే ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వయంగా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నానన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 40.58 లక్షల పట్టా దారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశామని వెల్లడించారు. అక్టోబరులోనే 790 గ్రామాల్లో నాలుగు లక్షలకు పైగా రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. ఇంకా పంపిణీ చేయాల్సిన 51 లక్షల పాస్ పుస్తకాలకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, అర్హులైన రైతులందరికీ అందిస్తామని చెప్పారు. చిట్టచివరి రైతు వరకూ పారదర్శకంగా హక్కు పత్రాలు అందించడమే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్ ప్రకాశం జిల్లాలోని ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పోతుల చెంచయ్య--పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.166.40 కోట్లతో రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రిజర్వాయర్ ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లో 35 వేల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. పొన్నలూరు మండలం వేమూరుపాడు రహదారి, పాలేరు నదిపై వంతెన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ.28 కోట్లతో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చామని చంద్రబాబు చెప్పారు. ఆ ప్రాజెక్టు రెండో దశను కూడా పూర్తిచేసి అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. నీరు అందుబాటులోకి రాకుండానే రిబ్బన్లు కట్ చేయడం, ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినట్లు ప్రచారం చేసుకోవడం తమ విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 40 చిన్నా పెద్ద నదులను అనుసంధానించి నీటి గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించవచ్చన్నారు. గోదావరి నుంచి కావేరి వరకు అనుసంధానం జరిగితే నాలుగు రాష్ట్రాల్లో నీటి కొరతను అధిగమించే అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భూగర్భ జలాల పెంపునకు కూడా పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో ప్రకాశం అభివృద్ధి ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలను ప్రపంచ స్థాయి ఉద్యానవన పంటల కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పల్లె పండుగ ద్వారా రూ.11 వేల కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, మంగళగిరి తదితర ప్రాంతాల్లో 60 వేల మందికి నివాస స్థలాలపై హక్కులు కల్పించామని, వాటి మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లుగా ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, అదనంగా మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా అమరజీవి జలధార కింద రూ.31 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామని చంద్రబాబు చెప్పారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.1.5 లక్షల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని సీఎం వెల్లడించారు. రామాయపట్నం పోర్టు గతంలోనే పూర్తి కావాల్సి ఉన్నా నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.బీసీలకు పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయానికి సంబంధించి స్పందించిన ముఖ్యమంత్రి.. పార్టీ పరంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. టీడీపీకి బీసీలు వెన్నెముక అని, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి పార్టీ ఎప్పుడూ కృషి చేసిందని చెప్పారు. గతంలో తాము తీసుకొచ్చిన 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టించిందని వాటిని 24 శాతానికి తగ్గించడం వల్ల అనేకమంది నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే న్యాయస్థానాల తీర్పులతో ఆ రిజర్వేషన్ల అమలుకు ఆటంకం ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు సంబంధిత జీవోను కొట్టివేసినప్పటికీ, పార్టీ పరంగా బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించి అండగా ఉంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఓటమి తప్పదనే సర్ పేరిట స్థానిక ఎన్నికలను కూడా అడ్డుకోవాలన్న ఆలోచనతోనే గొడ్డలి పార్టీ కోర్టులకు వెళ్లిందని సీఎం ఆక్షేపించారు ప్రజాభిప్రాయం ఆధారంగా పాలనలో మార్పులు ప్రజల బాగోగులే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే సమయంలో కుటుంబానికి మంచి జరగాలని కోరుకోవడంతో పాటు, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ పనితీరుపైనా ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను ఫోన్ ద్వారా నేరుగా తెలుసుకుని, అవసరమైన మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేసి, పౌరసేవల్లో పారదర్శకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాలను మరింత పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల శ్రీవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

**నరసింగోలులో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమం.. పాల్గొన్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**ప్రజాసీమ:**

ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం, జరుగుమల్లి మండలం, నరసింగోలు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.అలాగే జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్‌రావు, రాష్ట్ర సముద్ర తీర మండలి చైర్మన్ దామచర్ల సత్య, కనిగిరి శాసనసభ్యుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు.వీరితోపాటు జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఓట్ల చోరిపై ప్రశ్నిస్తే హౌస్ అరెస్టా? కాంగ్రెస్ పోరాటం ఆగదు

## - కాంగ్రెస్ సమన్వయకర్త ధృవకుమార్ రెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

ఓట్ల చోరిపై ప్రశ్నిస్తే హౌస్ అరెస్టా? ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డిని అడ్డుకోవడమేనా! ప్రజాస్వామ్యం, కాంగ్రెస్ పోరాటం ఆగదు అని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి మండిపడ్డారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా రాజ్ భవన్ కు శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డిని కూటమి ప్రభుత్వం పోలిసుల ద్వారా హౌస్ అరెస్ట్ చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఓటు హక్కుపై ప్రశ్నలు లేవనెత్తడం నేరం కాదన్నారు. ప్రజల తరపున గొంతెత్తే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఓట్ల చోరిపై ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని, ప్రజల గొంతును అణచివేయడం సిగ్గుచేటన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యమే శాస్వతమని వెల్లడించారు. ప్రజల ఓటు హక్కును, ప్రశ్నించే హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తోందన్నారు.






# రాహుల్ రాద్ధాంత రాజకీయాలు మానుకోవాలి

## - ఆరు స్థానాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు సున్నా

## - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

**వేంపల్లె ప్రజాసీమ:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాద్ధాంత రాజకీయాలను మానుకోవాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఉప ఎన్నికల్లో ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక సీటు కూడా దక్కలేదని, ఆ పార్టీకి సున్నా సీట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఓటమికి రాజ్యాంగ సంస్థలపై నిందించడం పరిపాటిగా మారిందని, యూపిలో 1989, బీహార్ లో 1990, పశ్చిమ బెంగాల్ 1977, గుజరాత్ లో 1998, ఆంధ్రప్రదేశ్ లో 2014 నుంచి కాంగ్రెస్ ని ప్రజలు అధికారానికి దూరంగా ఉంచారని గుర్తు చేశారు. ఇన్నాళ్లూ ప్రజలు ఎందుకు తిరస్కరిస్తున్నారో ఆలోచించకుండా.. ప్రజల తీర్పును తప్పుపట్టడం సమంజసంగా ఉందా! అని ప్రశ్నించారు. ఓడిపోతే ఇవీఎం లదే తప్పు.. ఎన్నికల సంఘానిదే తప్పు, ఓటర్ల జాబితాదే తప్పు, ప్రధాన ఎన్నికల కమిషనర్ దే తప్పు.. రాహుల్ గాంధీ మాత్రం ఎప్పుడూ తప్పు కాదా అని నిలదీశారు. ప్రతికూల రాజకీయాలు, విద్వేషం, డొల్ల హామీలు, అవినీతి, అసమర్థత, అహంకారంతో కాంగ్రెస్ తనకు తానుగా ప్రజలకు దూరమైందని వెల్లడించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, వికసిత్ భారత్ లక్ష్యాలను ప్రజలు మళ్ళీ మళ్ళీ మద్దతు ఇస్తున్నారన్నారు. రాజ్యాంగ సంస్థలపై దాడులు మానుకొని ప్రజాతీర్పును అవమానించడం ఆపాలని, దేశంపై తప్పుడు ప్రచారం చేస్తే ఓట్లు రావని, తాము చేస్తున్న తప్పులను సరిదిద్దు కోవాలన్నారు. అలాగే ప్రజల మధ్య విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. ప్రధానంగా ఓటర్లను గౌరవించే సంస్కృతిని నేర్చుకోవాలని హితవు పలికారు.



# పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

## రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్ష. ప్రమోషన్లు అడ్డుకున్నారని ఆరోపణలు

## ఒకరిపై మాత్రమే కఠిన చర్యలెందుకంటూ యూనియన్ నాయకుల ప్రశ్న

**పీలేరు ప్రజాసీమ:**

పీలేరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగ సమస్యలు, డిపో మేనేజర్ ఎస్ఎండీ రోషన్ తీరును నిరసిస్తూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజూ కొనసాగింది. డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై యూనియన్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు .టీఐ-3 బాబు నాయక్‌కు ప్రమోషన్‌కు అర్హత ఉన్నప్పటికీ చార్జిషీట్ పేరుతో ప్రమోషన్‌ను అడ్డుకున్నారని వారు ఆరోపించారు. అదేవిధంగా సీఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రమోషన్‌ను కూడా చార్జిషీట్ ద్వారా అడ్డుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. అర్హత ఉన్న ఉద్యోగుల ప్రమోషన్లకు అడ్డంకులు సృష్టించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు.కండక్టర్ జి. స్వప్న విషయంలోనూ డిపో మేనేజర్ వ్యవహరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ, వారిలో స్వప్నను మాత్రమే రిమూవ్ చేయడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. షోకాజ్ నోటీసు ఇచ్చిన అనంతరం కూడా స్వప్న ఒక్కరోజు విధులకు గైర్హాజరు కాకుండా డ్యూటీ నిర్వహించారని, అయినప్పటికీ ఆమెపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోవడం వెనుక కారణం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.మిగిలిన ఏడుగురిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఒక ఉద్యోగిపై మాత్రమే చర్యలు తీసుకోవడం న్యాయబద్ధమైన విధానమేనా? అంటూ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారిపైనే కఠినంగా వ్యవహరిం చడం సరికాదని విమర్శించారు.అభివృద్ధి పేరుతో ప్రచారమేనా?ఆర్టీసీ ప్రాంగణంలోని స్థలాన్ని శుభ్రపరిచి అభివృద్ధి చేసినట్లు డిపో మేనేజర్ చెప్పుకుంటున్నారని, వాస్తవానికి ఉద్యోగులు, యూనియన్ నాయకులు సొంతంగా డబ్బులు సమకూరిస్తే జేసీబీ ద్వారా స్థలాన్ని శుభ్రం చేయించారని నాయకులు ఆరోపించారు. డిపో అభివృద్ధి తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడం కంటే ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.డిపో అభివృద్ధి పేరుతో ఒకవైపు ప్రచారం చేసుకుంటూ, మరోవైపు కార్మికుల ప్రమోషన్లు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఇబ్బందులు కల్పిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఉద్యోగులపై తీసుకున్న చర్యలను పునఃపరిశీలించి న్యాయం చేయాలని, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగిస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.ఎన్ఎంయూఏ పీలేరు డిపో అధ్యక్షుడు సి.వి. రమణ, కార్యదర్శి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ రిలే నిరాహార దీక్షలో పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.ఆర్టీసీ నిబంధనల ప్రకారమే చర్యలు: డిపో మేనేజర్కార్మిక సంఘాల ఆరోపణలపై డిపో మేనేజర్ ఎస్ఎండీ రోషన్ను వివరణ కోరగా, ఆర్టీసీ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.



# స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు, అధికారాలు బదిలీ చేయాలి

## - ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**



స్థానిక ప్రభుత్వాలైన కార్పోరేషన్, మున్సిపల్, నగర పంచాయతీ, జిల్లా, మండల పరిషత్ లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం హర్షణీయం, అయితే వీటికి విధులు, నిధులు, అధికారాలు కూడా బదిలీ చేయాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తేనే ప్రయోజనం ఉంటుందని, అలా కాకుండా గత వైకాపా ప్రభుత్వం చేసిన విధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడి నామినేషన్లు వేయకుండా, కుల ధ్రువీకరణ, నో డ్యూ సర్టిఫికేట్లు ఇవ్వకుండా, తప్పుడు కేసులు బనాయించి పోలిసుల ద్వారా నిర్వహిస్తే ప్రయోజనం ఉండదన్నారు. అలాగే ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం విధులు, నిధులు, అధికారాలు బదిలీ చేయడం అంతకంటే ముఖ్యమని తులసిరెడ్డి వెల్లడించారు. రాజ్యాంగం నిర్దేశించిన 73,74 సవరణ చట్టాల ప్రకారం 11వ, 12వ షెడ్యూలల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించి వీటిని బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి ప్రభుత్వం. వైఎస్ షర్మిల గారి అరెస్ట్ పిరికిపంద చర్య

## అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం..

**పీలేరు ప్రజసీమ :**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు నిరసనగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో తలపెట్టిన "చలో లోక్ భవన్ / చలో రాజ్ భవన్" కార్యక్రమాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లి నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గారిని పోలీసులు అక్రమంగా గృహనిర్బంధం చేయడాన్ని ఆయన ఘాటుగా ఖండించారు.ఈ సందర్భంగా దుబ్బా శ్రీకాంత్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడమే కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పా?" అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రభుత్వం.. కేంద్రంలోని బీజేపీ కనుసన్నల్లో నడుస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తూ, నిరసనలకు అనుమతులు నిరాకరించడం,



నేతలను హౌస్ అరెస్టులు చేయడం వారి పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పోరాటాన్ని ఆపలేరని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజా హక్కులను కాపాడే వరకు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని దుబ్బా శ్రీకాంత్ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల రెడ్డె బాషా, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత

## - శ్రీ అఖండ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడమే లక్ష్యమని శ్రీఅఖండ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు స్పష్టం చేశారు.శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతల శాంతి కొరకు గోమాతలకు గ్రాసం అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ కె.వి రమణారెడ్డి,సభ్యులు ఇ.నాగప్రసాద్ నాయుడు,శ్యామ్ యాదవ్,పి.రమేష్,ఎం.దాము,ఎన్.రాజేష్,ఎన్.విద్యాసాగర్ రెడ్డి,భాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించి,హిందూ సాంప్రదాయాలపై అవగాహన కల్పిస్తామన్నారు.భారతీయ సంస్కృతి,సాంప్రదాయలు ప్రపంచ దేశాలకు ఆదర్శమన్నారు.ప్రజలు పాశ్చత్య సంస్కృతిని విడనాడి,హిందూ సంస్కృతిని పెంపొందించుకోవాలని సూచించారు.గోవులను హిందువులు పవిత్రంగా పూజిస్తారని,పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.మహాలయ అమావాస్య రోజున మంచి కార్యక్రమాలు నిర్వహిస్తే పితృదేవతలు ఆనందిస్తారన్నారు.శ్రీఅఖండ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ ద్వారా సమాజాన్ని జాగృతం చేసి,సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని వారు వెల్లడించారు.





# పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసిన పోలీస్ అధికారులు:

**పుంగనూరు ప్రజాసీమ :**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాలతో పోలీసు అధికారులు పుంగనూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తనిఖీ లు చేశారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా ఓటు వేసేలా ఆయా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు .ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలందరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని పోలీసు యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో సి .ఐ సుబ్బరాయుడు ఎస్ఐ ఆన్సర్ భాష పోలీస్ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# గొల్లప్రోలు మార్కెట్ తరలింపుపై వ్యాపారుల ఆందోళన

## ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాకే ఖాళీ చేస్తామని స్పష్టం.

## పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలని వినతి.

గొల్లప్రోలు : (ప్రజా సీమ )

గొల్లప్రోలు రాయవరం రోడ్డులోని డైలీ మార్కెట్ తరలింపు వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుమారు 60 ఏళ్లుగా మార్కెట్‌ను నమ్ముకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వ్యాపారులకు మున్సిపల్ అధికారులు వారం రోజుల్లోగా స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంతో నిరసనకు దిగారు. నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం కోసం స్థలాన్ని ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం వ్యాపారులు దుకాణాలను మూసివేసి గొల్లప్రోలు ప్రధాన రహదారిపై,మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని, అనువైన ప్రత్యామ్నాయ స్థలం కేటాయించకుండా దుకాణాలను తొలగించాలని చూడటం సరికాదని నినాదాలు చేశారు.మార్కెట్ ప్రాంతంలో కూరగాయలు, చేపలు, మాంసం, కిరాణా, బార్బర్ దుకాణాలు, చిన్న హోటళ్లు తదితర వ్యాపారాలు నిర్వహిస్తూ పలువురు జీవనం సాగిస్తున్నారు. రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు సంపాదించుకునే చిరు వ్యాపారులు ఈ మార్కెట్‌పైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. మూడు తరాలుగా ఇదే ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఉన్నఫళంగా దుకాణాలు తొలగిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.మార్కెట్‌ను అభివృద్ధి చేయాల్సింది పోయి ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వ్యాపారులు ప్రశ్నించారు. అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ స్థలాలు తమ వ్యాపారాలకు అనుకూలంగా లేవని, కొత్త ప్రాంతానికి తరలిస్తే వినియోగదారులు తగ్గిపోయి వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అరకొర ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు మరోచోట దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాన్ని కొనసాగించడం భారమవుతుందని పేర్కొన్నారు.మార్కెట్‌ను తరలించే ముందు వ్యాపారులకు అనువైన స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా బలవంతంగా దుకాణాలను ఖాళీ చేయిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మార్కెట్ తరలింపు సమస్యపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తమ జీవనోపాధిని కాపాడాలని వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్న చిరు వ్యాపారులకు నష్టం కలగకుండా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా, వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా అధికారులు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.






# పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసిన పోలీస్ అధికారు:

పుంగనూరు ప్రజాసీమ :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాలతో పోలీసు అధికారులు పుంగనూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తనిఖీ లు చేశారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా ఓటు వేసేలా ఆయా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు .ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలందరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని పోలీసు యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో సి .ఐ సుబ్బరాయుడు ఎస్ఐ అన్సర్ భాష పోలీస్ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# నాణ్యమైన కంప్యూటర్ కోర్సులతో మెరుగైన అవకాశాలు

## - ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి వెల్లడి

### - శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ నందు శిక్షణ అద్భుతమని ప్రశంసలు

మదనపల్లె (ప్రజా సీమ) :

నాణ్యమైన కంప్యూటర్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఏపి శాసనమండలి ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి పేర్కొన్నారు.శనివారం తనభర్త వెంకటనారాయణతో కలిసి మదనపల్లి పట్టణంలో ఆమె పర్యటించారు.ఈ నేపథ్యంలో సొసైటీ కాలనీలోని శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా అజయ్ కుమార్ ఆహ్వానం మేరకు ఇనిస్టిట్యూట్ ని సందర్శించారు.ఇందులో భాగంగా శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ నందు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కోర్సులు,కల్పిస్తున్న సౌకర్యాలను ఎమ్మెల్సీకి అజయ్ కుమార్ వివరించగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి మాట్లాడుతూ నాణ్యమైన కంప్యూటర్ కోర్సులను పూర్తిచేస్తే మెరుగైన ఉపాధి,ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.శ్రీ గుడ్విల్ కంప్యూటర్స్ నందు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నారని ప్రశంసించారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని కొనియాడారు.ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్రంలో అక్షరాస్యత శాతం గణనీయంగా పెరుగుతోందన్నారు.అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి తమ ఇనిస్టిట్యూట్ ని సందర్శించి సూచనలు,సలహాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.రాజకీయాలలో నిస్వార్థమైన మహిళ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారని,ఆమె సమర్థతను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీగా నియమించడం గర్వకారణని కొనియాడారు.ఇటువంటి నిజాయితీపరులైన రాజకీయ నేతలు సమాజానికి ఎంతో అవసరమని ఆయన వెల్లడించారు.అనంతరం తన సతీమణి బిందుతో కలిసి ఎమ్మెల్సీ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి,జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ గుడ్విల్ కంప్యూటర్స్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శంకర,తుమ్మలచెట్లపల్లి సురేంద్ర,చల్లా రమేష్,శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన విజయదుందుభి మోగిద్దాం

## - 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యం

## - రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి స్పష్టం

మదనపల్లె (ప్రజా సీమ) :

సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఘనవిజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జనసేన పార్టీ సత్తా చాటుతుందని గంగారపు రాందాస్ చౌదరి ధీమా వ్యక్తం చేశారు.మున్సిపల్ ,జెడ్పీటీసీ,ఎంపీటీసీ,సర్పంచ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.శనివారం మదనపల్లె పట్టణం,కమ్మవీధి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాందాస్ చౌదరి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించి చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు.అదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల మద్దతుతో విజయపరంపర కొనసాగించేందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మార్గనిర్దేశంలో ముందుకు సాగుతున్నామని తెలిపారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజంపేట పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అబ్జర్వర్లు,సమన్వయ కర్తలు కమిటీ సభ్యులు,సపోర్ట్ టీములను నియమించినట్లు రాందాస్ చౌదరి వెల్లడించారు.కూటమిలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించే ప్రతిస్థానాన్ని గెలిపించుకోవడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఇందుకోసం స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని,ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ,పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి,అరాచక పాలన చోటుచేసుకున్నాయని రాందాస్ చౌదరి ఆరోపించారు.రాష్ట్రంలో అభివృద్ధి,ప్రజా సంక్షేమం ముందుకు సాగాలంటే కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు అవసరమన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి,కూటమి బలాన్ని మరింత పెంచాలని పిలుపునిచ్చారు.క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం,ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మీపతి,స్థానిక సంస్థల పార్లమెంట్ కమిటీ సభ్యుడు ప్రదీప్ సింగ్,సపోర్ట్ టీం సభ్యుడు అడపా సురేంద్ర, బీసీ నాయకులు బండి మనోహర్,కోళ్లబైలు-1 ఇంచార్జి రాజారెడ్డి,కుమార్ ,సువారపు చంద్రశేఖర్,జవిలి మోహన కృష్ణ,మేకల చెరువు అర్జున,పురం నగేష్,మల్లిక, సరస్వతి,అఫ్రోజ్ ఖాన్,జయభవ్య,భారతి తదితరులు పాల్గొన్నారు.



# డీఆర్‌డీఓ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన మిట్స్ విద్యార్థులు






మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం విద్యార్థులు పారిశ్రామిక విద్యా పర్యటనలో భాగంగా బెంగళూరులోని భారత ప్రభుత్వ రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలో పనిచేస్తున్న ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఈ) కేంద్రాన్ని సందర్శించినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా ద్వితీయ సంవత్సరం బీటెక్ ఈసీఈ లేటరల్ ఎంట్రీ విద్యార్థులు రక్షణ రంగంలో వినియోగించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందారు.ఈ సందర్శనలో ఏడీఈ,డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ఈ.అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి,పరిశోధనల వైపు ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు.రక్షణ రంగంలో ఎలక్ట్రానిక్స్,కమ్యూనికేషన్ వ్యవస్థలు,రాడార్ టెక్నాలజీ,ఏరోస్పేస్ ఇంజినీరింగ్,కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతలకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు.ఏడీఈ సంస్థలోని నియంత్రణ వ్యవస్థలు (కంట్రోల్ సిస్టమ్స్),మైక్రోవేవ్ యాంటెన్నాలు,రాకెట్లు మరియు జలాంతర్గాముల్లో ఉపయోగించే కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శనతో కూడిన వివరణ ఇచ్చారు.ఆయా సాంకేతిక వ్యవస్థల పనితీరు,వాటి ఆచరణాత్మక అనువర్తనాల గురించి విద్యార్థులకు వివరించారు. డీఆర్‌డీఓలో సైంటిస్ట్ బి,సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్,టెక్నీషియన్, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) వంటి వివిధ పోస్టులకు విద్యార్హతలు,అర్హత ప్రమాణాల ఆధారంగా నియామకాలు చేపడతారని తెలిపారు .విద్యార్థులు ఈ ఉద్యోగావకాశాలపై అవగాహన పెంపొందించుకొని, అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ,దేశ రక్షణ రంగంలో సేవలందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ పర్యటన ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పుస్తక అంశాలను రక్షణ రంగంలో అమలవుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించుకునే అవకాశం పొందడంతో పాటు,ఏరోనాటిక్స్,కమ్యూనికేషన్ వ్యవస్థలు,రక్షణ పరిశోధన రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిపై విలువైన అవగాహన పొందారని తెలిపారు.ఈ పారిశ్రామిక పర్యటనలో ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చరణ్ కుమార్,డాక్టర్ జన్మోని బోరా,డాక్టర్ స్మృతి బోరా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఇటువంటి పారిశ్రామిక పర్యటనలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యా లను పెంపొందించడంతోపాటు, పరిశోధనా సంస్థల్లో జరుగుతున్న కార్యకలాపాలను ప్రత్యక్ష ంగా తెలుసుకునేందుకు,భవిష్యత్తులో ఉన్నత సాంకేతిక రంగాల్లో అవకాశాలను అన్వేషించేందుకు దోహదపడతాయని తెలిపారు.

# రైతుబజార్ లో కమర్షియల్ షాపుల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం!

పుంగనూరు ప్రజాసీమ :




పట్టణంలోని ఏఎంసీ మార్కెట్ ఆవరణం లోని రైతుబజార్ లో ఖాళీగా ఉన్న స్టాళ్లు, కమర్షియల్ షాపులను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు అర్హులైన వారి నుంచిదరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి. త్యాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.డ్వాక్రా గ్రూపులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు , హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, ఇతర ఆసక్తి గల వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోవచ్చునిపేర్కొన్నారు.దరఖాస్తు ఫారాలను అక్టోబర్ 8 నుంచి 15వ తేదీ వరకు పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుంగనూరు రైతుబజార్లలో పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారానికి రూ.50 చెల్లించాల్సి ఉంటుందనివెల్లడించారు.రైతుబజార్లలోని కమర్షియల్ షాపులను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తామన్నారు. అలాగే రైతులకు స్టాళ్లను ఉచితంగా కేటాయించనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాల కోసం 91823 61536 నంబరులో సంబంధిత అధికారిని సంప్రదించాలని అసిస్టెంట్ డైరెక్టర్ కోరారు.

ప్రజాసీమ

# పార్టీ బలోపేతమే లక్ష్యం





పిఠాపురం: (ప్రజా సీమ )

పిఠాపురం నియోజకవర్గంలో నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యువ నాయకుడు ఓదూరి కిశోర్ కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలను అప్పగించింది. ప్రజాసేవలో ఆయన చూపిస్తున్న నిబద్ధత, కార్యదీక్షను గుర్తిస్తూ ఆయన్ను కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ దళ్ సభ్యునిగా నియమిస్తూ పార్టీ అధిష్టానము ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంతకుముందు పిఠాపురం నియోజకవర్గంలో పనిచేసిన ఫైవ్‌మెన్ కమిటీని అధిష్టానం రద్దు చేసిన నేపథ్యంలో, కిశోర్ సేవలను మరింత విస్తృతంగా ఉపయోగించుకోవాలనే సంకల్పంతో పార్టీ ఈ నూతన బాధ్యతలను అప్పగించింది. నియోజకవర్గ స్థాయి నుంచి ఏకంగా పార్లమెంట్ స్థాయికి బాధ్యతలు పెంచుతూ తీసుకున్న ఈ నిర్ణయం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఓదూరి కిశోర్ నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో పిఠాపురం ఫైవ్‌మెన్ కమిటీ సభ్యునిగా ఆయన నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. రహదారుల దుస్థితి, డ్రైనేజీ సమస్యల నిర్మూలన, తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్య రంగాలు మెరుగుపడాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న స్థానిక సమస్యలను సైతం వేగంగా పరిష్కరించి ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్నారు. కేవలం సాధారణ రోజుల్లోనే కాకుండా, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ, తుపాన్లు మరియు భారీ వర్షాల వల్ల వరదలు వచ్చినప్పుడు బాధితులకు ఆయన అండగా నిలిచారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి, బాధితులకు నిత్యావసరాలు, వైద్య సహాయం అందించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించి, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూశారు. పిఠాపురం నియోజకవర్గ స్థాయి నుంచి కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయికి కిశోర్ సేవలను విస్తరించడం ఆయన కార్యదక్షతకు దక్కిన గుర్తింపు అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నూతన బాధ్యతతో కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ మరింత పటిష్టం కానుంది. యువతను, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలో ఆయనకున్న అనుభవం పార్టీకి కలిసిరానుంది. ఈ నియామక వార్త తెలియగానే కాకినాడ పార్లమెంట్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు,



అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా మరియు వ్యక్తిగతంగా ఓదూరి కిశోర్ గారికి అభినందనలు తెలుపుతున్నారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాకినాడ పార్లమెంట్ పరిధిని ప్రగతి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా కిశోర్ ధీమా వ్యక్తం చేశారు.

# చట్టబద్ధత సమస్యలున్న బీసీలకు న్యాయం

## రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు

సిద్ధవటం ప్రజా సీమ

బీసీల రాజకీయ సాధికారతకు చట్టబద్ధతమైన నిలకడైన పరిష్కారాన్ని కను గోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని దూదేకుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు పేర్కొన్నారు మండలంలోని మాధవరం-1 వెంకటేశ్వరపురం గ్రామం లోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ చట్టబద్ధత సమస్యలున్న రాజకీయంగా బీసీలకు 34 శాతం కంటే ఎక్కువ సీట్లు ఇచ్చి బీసీ సామాజిక వర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని బీసీలకు వెన్నెముక పార్టీ టిడిపి పార్టీ అని పేర్కొన్నారు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను అన్యాయం చేసి ఒకే సామాజిక వర్గానికి పదవులు అందలం ఎక్కించారని పేర్కొన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాలు కూటమి వైపే ఉన్నారన్నారు, వైసిపి పాలనలో ప్రతిపక్ష పార్టీలను నామినేషన్లు వేయకుండా భయభ్రాంతులను గురిచేసి తప్పుడు కేసులు పెట్టి ఏకగ్రీవాలు చేశారని అవన్నీ మాకు గుర్తున్నాయి అన్నారు రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలని వైసిపి ముసలి కన్నీరు కారుస్తుందని మీకు అధికారం ఉంది కదా అని ఆరోజు మమ్మల్ని ఏం చేశారు మీకు గుర్తుందా అని పేర్కొన్నారు



# పలువురిని పరామర్శించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

## - నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా

వేంపల్లె ప్రజాసీమ:

మండలంలోని పలు గ్రామాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పర్యటించి పలువురిని పరామర్శించారు. సెప్టెంబర్ 25వ తేదీన మండలంలోని నాగూరు గ్రామంలో ఉన్న వైఎస్ఆర్సిపి నాయకుడు నాగేళ్ల రామచంద్రారెడ్డి కుమారుడు రాంప్రసాద్ రెడ్డి(21) చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో యాక్సిడెంట్ అయి మృతి చెందాడు. శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మృతుని స్వగృహమైన నాగూరు గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఎగువ తువ్వపల్లి గ్రామంలో ఉండే మాజీ ఎంపీటీసీ వెంకటనారాయణ రెడ్డి అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి రావడంతో తన స్వగృహానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వచ్చి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వైఎస్ఆర్సిపి ఎప్పుడు తమకు అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం నాయకులు కార్యకర్తలను కలిసి స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. అలాగే ఇటీవల గ్రామ కమిటీ సభ్యులకు ఇచ్చిన గుర్తింపు కార్డులను ఆయన అందజేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి కమిటీ నుంచి కష్టపడి పనిచేయాలని సూచించారు. వచ్చేది మన ప్రభుత్వమేనని అందరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఎం.రవి కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# రహదారి భద్రత నిబంధనలను ప్రజలు తెలుసుకోవాలి

## - ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా ఆద్వర్యంలో అవగాహన

మదనపల్లె (ప్రజా సీమ) :

రహదారి భద్రత నియమాలను ప్రజలు తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మదనపల్లె టమోటా మార్కెట్ సమీపంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ సీఐ చాంద్ బాషాతమ సిబ్బందితో కలిసి వాహనదారులకు హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని,డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని,వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని,వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మదనపల్లె పట్టణంలో రోడ్డు




ప్రమాదాల నివారణ,ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల నిరసనకు ఐటియుసి మద్దతు

## - కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి

## - మదనపల్లె డివిజన్ కన్వీనర్ జి.కృష్ణమూర్తి డిమాండ్

మదనపల్లె (ప్రజా సీమ) :

సుదీర్ఘ కాలంగా నిరంతర సేవలందిస్తున్న అర్హులైన ప్రస్తుత కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో తమ నిరసనను కొనసాగించారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు వందశాతం గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించి పారా మెడికల్ క్యాడర్లకు రెగ్యులర్ నియామక నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఐటియుసి మదనపల్లె డివిజన్ కన్వీనర్ జి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో జిల్లా వ్యాప్తంగా మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు,ల్యాబ్ టెక్నీషియన్లు,ఫార్మసీ అధికారులు,ఇతర మెడికల్ కాంట్రాక్టు సిబ్బంది పూర్తిగా విధులు బహిష్కరించి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసనకు ఐటియుసి నాయకుడు జి.కృష్ణమూర్తి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున రాష్ట్రంలోని ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన 95 రోజులుగా వారు తమ నిరసనను వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులు అంకితభావంతో సేవలను అందిస్తున్నప్పటికీ గత 16 సంవత్సరాలుగా మెడికల్ పోస్టులు రెగ్యులర్ నియామకాలు జరపకపోవడం వల్ల అర్హత,అనుభవం కలిగిన సిబ్బంది కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుంచి అమల్లోకి వచ్చిన వేతన తగ్గింపును సమీక్షించి డిఏ,హెచ్ఆర్ఏతో వందశాతం గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శాంతియుత నిరసనతో పాటు పెన్డౌన్ కార్యక్రమాన్ని తలపెట్టిన,జిల్లా కలెక్టర్,ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చిన స్పందన లేక పోవడంతో విధులను బహిష్కరించి నిరసనలో పాల్గొనే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం,ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసనలో అన్నమయ్య జిల్లా చెందిన పారామెడికల్ క్యాడర్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు.



# జిల్లా నూతన డిఎం అండ్ హెచ్ఓగా డాక్టర్ జి.ఉష శ్రీ

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా డిఎం అండ్ హెచ్ఓ (ఎఫ్ఏసి)గా డాక్టర్ జి.ఉషశ్రీ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,గ్రామీణ వైద్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు,వైద్య సిబ్బంది పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని,మానవతా దృక్పథంతో సేవలందించాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని,ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఆరోగ్య సూచీలో అన్నమయ్యను ముందు వరుసలో నిలుపుతామని ఆమె స్పష్టం చేశారు. గతంలో జిల్లా డిఐఓగా విధులు నిర్వహించానని,ఆ అనుభవం తనకు దోహదపడుతుందన్నారు. నూతన డిఎం అండ్ హెచ్ ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉషశ్రీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజాసీమ

# స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీలో పిఠాపురం నాయకులకు చోటు

## ఏడుగురికి కీలక బాధ్యతలు

పిఠాపురం: (ప్రజా సీమ )

జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ ప్రక్రియలో భాగంగా కాకినాడ జిల్లా పార్లమెంటరీ కమిటీ సమన్వయకర్త, నిర్వాహక్ దళ్‌లో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ఏడుగురు నాయకులకు చోటు కల్పించారు. పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ఈ నియామకాలు చేపట్టారు.

కమిటీలో బుర్రా దివ్యరాజ్ (మల్లం), వాకపల్లి దేవి సూర్యప్రకాష్ (కందరాడ), ఓదురి కిషోర్ (చేబ్రోలు), పెంకే జగదీష్ (చిత్రాడ), దొడ్డి దుర్గాప్రసాద్ (ఉప్పాడ), వేగిశెట్టి సూర్యనికల్ (రావివరిపోదు), కోలా దుర్గాదేవి (పిఠాపురం) స్థానం దక్కించుకున్నారు.

వీరంతా కాకినాడ జిల్లా పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయి సమాచార సేకరణలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. పార్టీ సంస్థాగత పరిస్థితులు, నాయకులు, జనసైనికుల పనితీరు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించి పార్లమెంటరీ కమిటీకి నివేదికలు అందించనున్నారు.ఈ నియామకాలపై జనసేన నాయకులు, జనసైనికులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు అభినందనలు తెలిపారు.




# బీసీ రిజర్వేషన్లపై ఏపీ క్యాబినెట్ నిర్ణయం శుభపరిణామం

## - టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ హర్షం

మదనపల్లె (ప్రజా సీమ) :



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ తీసుకున్న కీలక నిర్ణయం శుభసూచకమని రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దపీట వేయడం ఆయన సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు.టిడిపి పార్టీ పుట్టినప్పటి నుండి రాష్ట్రంలో బీసీల పక్షపాతిగా నిలుస్తోందని తులసి గుర్తు చేశారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటనున్నారని తులసీ ధీమా వ్యక్తం చేశారు.బీసీ (వెనుకబడిన తరగతులు) రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందన్నారు.బీసీ రిజర్వేషన్ల శాతాలను ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజేష్ రంజన్ నేతృత్వంలోని కమిషన్ అందించిన నివేదిక,సిఫార్సుల ఆధారంగా మొత్తం 8 విభాగాల్లో (కేటగిరీలలో) రిజర్వేషన్ల శాతాన్ని కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించిందన్నారు.మేయర్ పదవులకు 35.29%,మున్సిపల్ చైర్మన్ పదవులు 33.02%,అర్బన్ వార్డులు 32.78%,సర్పంచ్ స్థానాలు 27.95%,పంచాయతీ వార్డులు 26.73%,ఎంపీటీసీ స్థానాలు 25.55%,ఎంపీపీ పదవులు 24.60%,జడ్పీటీసీ స్థానాలు 24.60%,జడ్పీ చైర్మన్ పదవులు 23.08%,స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన,నిబంధనలకు అనుగుణంగా న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేందుకే రాజేష్ రంజన్ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ కేటాయింపులు చేపట్టినట్లు ఆమె స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మరింత ఊపందుకోనుందన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# అత్యంత వైభవంగా శ్రీబాట గంగమ్మ ఆలయ 9వ వార్షికోత్సవం

## - హాజరైన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు

మదనపల్లె (ప్రజా సీమ) :





జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలోని వాల్మీకి వీధి,బుగ్గ కాలువ వద్ద ఉన్న శ్రీ బాట గంగమ్మ అమ్మవారి దేవస్థానం 9వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.ఈ వేడుకలకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు హాజరై అమ్మవారిని దర్శించుకుని,ఆశీస్సులు పొందారు.కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బాట గంగమ్మ ఆలయం 9వ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిగిందన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ అన్నమయ్య జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు,శ్రీనివాసులు,జాదవ్ చందు,బీజేపీ యువ

# కలకడ బాలయ్యగారిపల్లిలో రూ.3.70 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్

## భూమిపూజ నిర్వహించిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

కలకడ ప్రజాసీమ:

కలకడ మండలం బాలయ్యగారిపల్లి సమీపంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు భూమిపూజ నిర్వహించారు. పీలేరు డివిజన్ పరిధిలో సుమారు రూ. 3.70 కోట్ల అంచనా వ్యయంతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.అన్నమయ్య జిల్లా ఆపరేషన్స్ ఎస్ఈ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాస్, పీలేరు ఆపరేషన్స్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, కలికిరి డీఈఈ శివయ్య, కలకడ ఏఈ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే బాలయ్యగారిపల్లి పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు, వోల్టేజ్ సమస్యలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.భవిష్యత్తులో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిషన్ పెద్దన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

## - బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు

## - కొనియాడిన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్

మదనపల్లె (ప్రజా సీమ)

: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల పక్షపాతి అని అన్నమయ్య జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. శనివారం అంగళ్ళు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.శనివారం అంగళ్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి,సుమారు 17 వేల మందికి స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం దూరం చేసిన వైసీపీకి సమాధానం చెప్పే ధైర్యముందా అని ప్రశ్నించారు.బడుగు,బలహీ న వర్గాలపై వైసీపీ కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించిందని విమర్శించారు.బీసీలపై ప్రేమ,గౌరవం ఉన్నాయని చెప్పుకునే వైసీపీ నేతలు తమ ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్లను ఎందుకు తగ్గించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.ఎన్టీఆర్ హయాంలో 20 శాతం రిజర్వేషన్లను బలహీనవర్గాల సంక్షేమం,రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.1985లో దివంగత ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని,అనంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాటిని 34 శాతానికి పెంచారని పేర్కొన్నారు.జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లు పెంచినట్లు వివరించారు.జగన్ హయాంలోనే తగ్గింపువైఎస్ రాజశేఖరరెడ్డి,కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనూ స్థానిక సంస్థల ఎన్నికలు 34 శాతం బీసీ రిజర్వేషన్లతోనే జరిగాయని ఆయన గుర్తుచేశారు.జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించిందని విమర్శించారు.అప్పటి వరకు అమల్లో ఉన్న రిజర్వేషన్లను తగ్గించడానికి బాధ్యులెవరో వైసీపీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు.దీనిని దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కూటమి పార్టీలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



# శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో వైభవంగా దసరా ఉత్సవాలు

## - సాంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్న విద్యార్థులు

మదనపల్లె (ప్రజా సీమ) :

పట్టణంలోని ప్రశాంత్ నగర్ నందు గల చైతన్య టెక్నో పాఠశాలలో దసరా పండుగ వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయులు అత్యంత వైభవంగా నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాఠశాల ఆవరణను సాంప్రదాయబద్ధంగా అలంకరించారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు.ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది.విద్యార్థులు ప్రదర్శించిన దుర్గాష్టమి నృత్యాలు,మహిషాసురమర్దిని నాటకం,దసరా ప్రాముఖ్యతను తెలిపే ప్రసంగాలు అలరించాయి.ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం డాక్టర్ జి.సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి,సాంప్రదాయాలను తెలియజేయడానికే ఇటువంటి పండుగ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పాఠశాల ఆర్.ఐ శ్రీధర్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్ మురళీధర్,హేమలత,డీన్ అనికుమార్,ప్రైమరీ ఇంచార్జి శివకుమారి,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




# ఈ నెల 12, 13 న పెద్దిరెడ్డి వార్డు సమావేశాలు.

## ప్రజలను చైతన్యపరిచేందుకు వార్డు సమావేశాలు.

## స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ సిపి పార్టీ గెలుపుకు కార్యకర్తలు నాయకుల తో మున్సిపాలిటి వార్డులలో సమావేశాలు.

పుంగనూరు

వైఎస్సార్‌సిపి రీజనల్ కోఆర్డినేటర్ , ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 12, 13 తేదీలలో రెండు రోజుల పాటు మున్సిపాలిటి వార్డులలో సమావేశాలు నిర్వహిస్తారని మాజీ మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను చైతన్యపరిచేందుకు వార్డు సమావేశాలను పెద్దిరెడ్డి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 12న ఉదయం 9 గంటలకు హనుమంతరాయునిదిన్నె లో గల ఫ్రెండ్స్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తారు. 11 గంటలకు మొదలియార్ల ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహిస్తారు. 12:30 గంటలకు నక్కబండలో సమావేశం జరుగుతుంది. 2:30 గంటలకు అంజుమన్ షాదీమహాల్‌లో , 3:30 గంటలకు రహమత్ నగర్‌లోని టిప్పుసర్కిల్‌లో సమావేశం జరుగుతుంది. అలాగే 13న ఉదయం జెఎండి ఫంక్షన్‌హాల్, 10:30 గంటలకు గాండ్ల ఫంక్షన్‌హాల్‌లో సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశాలను జయప్రదం చేసేందుకు వైఎస్సార్‌సిపి పార్టీ అభిమానులు, పెద్దిరెడ్డి అభిమానులు, ఆయా వార్డు మెంబర్లు, కార్యకర్తలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పెద్దిరెడ్డి సభలను జయప్రదం చేయాలని కోరారు.




# దేవి నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ని ఆహ్వానించిన వేణుగోపాల్ రెడ్డి !

పుంగనూరు ప్రజాసీమ :

మండల పరిధిలోని చదల్ల గ్రామంలో వెలసియుండు సప్త మాతృక సమేత శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 20 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, ఈ దేవీ నవరాత్రి ఉత్సవాలకు పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ని శనివారం వేణుగోపాల్ రెడ్డి ,జనసేన నాయకులు పలమనేర్ లో కలసి ఏటా ఘనంగా జరగనున్న ఉత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపా కటాక్షాలు పొందాలని వారు కోరారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తప్పకుండా విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొంటానని పేర్కొన్నారని వారు ఒక ప్రకటనలో తెలిపారు . ఈ కార్యక్రమంలో జనసేన పుంగనూరు పిఓసి చిన్నా రాయల్, నియోజకవర్గ జనసేన నాయకులు శంకర్ రెడ్డి రమణారెడ్డి రోహిత్ నాగరాజు రెడ్డి పలమనేరు జనసేన నాయకులు పూల చైతన్య,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



# ఎన్నికలు ప్రశాంతత వాతావరణంలో జరిగేటట్లు సహకరించండి

## సీఐ వెంకటేశ్వర్లు

సిద్ధవటం (ప్రజా సీమ )

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేటట్లు సహకరించాలని ఒంటిమిట్ట సర్కిల్ సెంటర్ వెంకటేశ్వర్లు తెలిపారు మండలంలోని పి కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలు ప్రశాంతత వాతావరణంలో సహకరించాలని సూచించారు ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని గొడవలు అల్లలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల ఎస్సై హారిక స్థానిక పోలీసులు పాల్గొన్నారు



## అలాంటి డైరెక్టర్లు ఇండస్ట్రీకి క్రిమినల్స్..హాట్ టాపిక్‌గా కోన వెంకట్ కామెంట్స్



తెలుగు సినిమా ఇండస్ట్రీలో స్క్రీన్‌రైటర్‌గా, నిర్మాతగా మంచి గుర్తింపు ఉన్న వ్యక్తుల్లో టాప్‌లో ఉంటారు కోన వెంకట్. సత్య సినిమా (తెలుగు డబ్ వెర్షన్) డైలాగ్ రైటర్‌గా కెరీర్ షురూ చేసిన కోన వెంకట్ ఆ తర్వాత అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి, శివమణి, వెంకీ, హ్యాపీ, ఢీ, అదుర్స్, దూకుడుతోపాటు ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు పనిచేశారు.తాజాగా ఈ పాపులర్ ప్రొడ్యూసర్ ఓ పోడ్‌కాస్ట్‌లో నిర్మాతలను వృథా ఖర్చు చేయించే డైరెక్టర్లపై చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి. ఎంతో ఖర్చు పెట్టి 3:50 గంటలు సినిమా తీసి.. నువ్వు దాంట్లో 1:15 గంటలు తీసేస్తే ఏంటీ ఉపయోగం అంటున్నా. ఆ 1:15 గంటలకు అయ్యే కోట్లు ఎవరివి.. నిర్మాతవే కదా.అతడు తెచ్చిన అప్పులు కదా.. పాపం ఆ నిర్మాత భార్యాపిల్లలకు చెందేవి కదా అవన్నీ.మరి నువ్వు ఎంత బాధ్యతారహితంగా ఖర్చు పెట్టావ్.. ఆ స్పృహ, ఆ జ్ఞానం.. ఆ డైరెక్టర్‌కు టీంకు ఉండాలి. హిట్టు, ఫ్లాప్ అనేది నీ చేతుల్లో లేదు.నీ చేతుల్లో ఉన్నదేంటి.. నీ ప్లానింగ్.. నువ్వు అది కూడా చేయకపోతే ఎలాగంటున్నా.2 గంటలు తీసిన సినిమా ఉంది ఆ పక్కన.. అటువంటి వాళ్లను బ్యాన్ చేయాలంటున్నా. వాళ్లు ఇండస్ట్రీకి క్రిమినల్స్ లాంటివాళ్లు. సినిమా రన్‌టైమ్‌పై క్లారిటీ లేకుండా నిర్మాతల డబ్బును వృథా చేసే డైరెక్టర్లు ఇండస్ట్రీలో ఉండకూడదు.అంటూ కోన వెంకట్ చేసిన కామెంట్స్ ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

## ఇంకా రచ్చ రచ్చే.. 'బ్లడీ రోమియో' కోసం నాని స్టైలిష్ మేకోవర్ చూశారా



'ఓజీ' తర్వాత డైరెక్టర్ సుజీత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న సినిమా 'బ్లడీ రోమియో' (Bloody Romeo). ఇప్పటికే బ్లడీ రోమియో టీజర్‌ను కూడా విడుదల చేసి ఫ్యాన్స్‌తోపాటు మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు సుజీత్ . ప్యారడైజ్ సినిమాలో రెండు జడలతో ఊహించని లుక్‌లో కనిపించిన నాని ఇక ఈ సారి నయా మేకోవర్‌లో సందడి చేయబోతున్నాడు. ఈ సారి మాత్రం సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు బ్లడీ రోమియో టీం రిలీజ్ చేసిన తాజా వీడియో ఒకటి హింట్ ఇచ్చేస్తుంది.స్టైలిష్ హెయిర్ అండ్ బ్లాక్ గూగుల్స్ లో మేకోవర్ అయిన నాని లుక్‌ను చూపించీ చూపించనట్టుగా సుజీత్ టీం ఫుడ్ ట్రక్‌పై.Bloody Romeo The Kitchen Open Soon అని రాసిన వీడియోను షేర్ చేసింది. ఈ సారి కొత్త నానిని చూడబోతున్నారని లేటెస్ట్ విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో వస్తోన్న బ్లడీ రోమియో చిత్రాన్ని వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు.నాని ఇందులో గ్యాంగ్‌స్టర్ నుంచి చెఫ్‌గా మారిన వ్యక్తిగా కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. బ్లడీ రోమియో షూటింగ్ అక్టోబర్‌లో షురూ కానుందని వార్తలు వచ్చాయని తెలిసిందే. నాని అక్టోబర్ నుంచి డేట్స్ కేటాయించాడట. కథానుగుణంగా సినిమాకు సంబంధించిన ప్రధాన భాగం లండన్‌లో షూట్ చేయనున్నారట. ఈ మూవీని ముందుగా డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ తెరకెక్కించాల్సి ఉండగా పలు కారణాల వల్ల నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్స్ చేతికి వెళ్లినట్టు టాక్.

## టికెట్ రేట్ల పెంపుపై విజయ్ దేవరకొండ సంచలన నిర్ణయం?.. ఇకపై ఆ ప్రసక్తే లేదట




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన తాజా చిత్రానికి సంబంధించి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న తన కొత్త సినిమా 'రణబాలి' విడుదల వేళ, టికెట్ల ధరల పెంపు గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి.ఈ నేపథ్యంలో విజయ్ స్వయంగా రంగంలోకి దిగి ఈ అంశంపై మాట్లాడుతూ. ఇకపై తాను నటించే ఏ చిత్రానికి కూడా అదనపు టికెట్ రేట్లు లేదా ప్రత్యేక హైక్స్ ఉండే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పినట్లు తెలుస్తుంది. రణబాలి చిత్రానికి సంబంధించి కూడా ఎలాంటి రేట్ల పెంపు కోరుకోవడం లేదని మేకర్స్ స్పష్టం చేసిన తరుణంలో, విజయ్ చేసిన ఈ ప్రకటన సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ఈ నిర్ణయంలో ఓ చిన్న మెలిక కూడా ఉంది. ఒకవేళ భవిష్యత్తులో దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో నటించే అవకాశం వస్తే మాత్రం ఆ ఒక్క సినిమాకు మినహాయింపు ఉంటుందని, మిగతా అన్ని సినిమాలకూ సాధారణ ధరలే వర్తిస్తాయని ఆయన కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై విజయ్ నుంచి కానీ అతడి టీమ్ నుంచి కానీ ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు టికెట్ ధరల పెంపు విషయంలో విజయ్ దేవరకొండ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, ఈ భారీ అంచనాల చిత్రం 'రణబాలి' అక్టోబర్ 16న అత్యంత ఘనంగా థియేటర్లలో సందడి చేయనుంది.

# ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు.. మృణాల్ ఠాకూర్ సీరియస్



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు.తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు.కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తల్లి అయిన తర్వాత శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఒక మహిళ శరీరంలో వచ్చే మార్పుల ఆధారంగా ఆమెను అంచనా వేయడం, బహిరంగంగా అవమానించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ ప్రకటనలో ధరించిన దుస్తుల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా విడుదలైన ఓ నగల ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ దుస్తులు పండుగ సందర్భానికి తగినవి కావంటూ విమర్శలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలో సదరు ప్రకటనను తొలగించారు.. తన ఉద్దేశం ఎవరి మనోభావాలను దెబ్బతీయడం కాదని కృతి సనన్ వివరణ ఇచ్చింది. కాగా, సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొంటున్నారని మృణాల్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అయితే మహిళల దుస్తులు, శరీరాకృతి, వ్యక్తిగత నిర్ణయాలపై తరచూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తుంది.

## గ్రామీ బరిలో 'ధురంధర్' సౌండ్‌ట్రాక్.. ఏకంగా ఎనిమిది కేటగిరీల్లో ఎంట్రీలు




రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం "ధురంధర్: ది రివెంజ్" సినిమా సంగీతం 2027 గ్రామీ అవార్డుల పరిశీలన కోసం ఎనిమిది విభాగాల్లో దరఖాస్తు చేసుకుంది. చిత్ర నిర్మాణ సంస్థ బి62 స్టూడియోస్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు ఆదిత్య ధర్ మరియు ఆయన సోదరుడు లోకేష్ స్థాపించిన ఈ స్టూడియో, సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ అందించిన బాణీలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఈ సినిమాకు సంబంధించి సౌండ్‌ట్రాక్ ఆల్బమ్‌తో పాటు విడి పాటలను కలిపి మొత్తం తొమ్మిది ఎంట్రీలను గ్రామీకి పంపినట్లు స్టూడియో తెలిపింది. విజువల్ మీడియా కోసం ఉత్తమ సంకలన సౌండ్‌ట్రాక్ విభాగంలో ఈ ఆల్బమ్ పోటీపడుతుండగా, అరిజిత్ సింగ్ పాడిన "ఫిర్ సే" పాటను 'విజువల్ మీడియా కోసం వ్రాసిన ఉత్తమ పాట' విభాగానికి పంపారు.అలాగే "ఆరి ఆరి" పాటను 'ఉత్తమ ఆసియన్ పాప్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' కేటగిరీకి, "జాన్ సే గుజార్తే హై", "కన్హయ్య" పాటలను 'ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' విభాగంలోనూ పరిశీలిస్తున్నారు. "జాయే సజనా" పాటను 'ఉత్తమ పాప్ డ్యూయో పెర్ఫార్మెన్స్' విభాగంలో, "డెస్టినీ -- మన్ అట్కేయా" పాటను 'ఉత్తమ రాప్ పెర్ఫార్మెన్స్' విభాగంలో, "వారి జావాన్" పాటను 'ఉత్తమ డాన్స్, ఎలక్ట్రానిక్ రికార్డింగ్' విభాగంలో, అలాగే "హమ్ ప్యార్ కర్నే వాలే" పాటను 'ఉత్తమ రీమిక్స్ రికార్డింగ్' విభాగంలో నామినేషన్ల కోసం సమర్పించారు.ఇర్షాద్ కమిల్ మరియు ఇతర రచయితలు సాహిత్యం అందించిన ఈ చిత్రంలోని పాటలకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించింది. డిసెంబర్ 2025లో వచ్చిన మొదటి భాగం రూ. 1,300 కోట్లకు పైగా వసూలు చేయగా, మార్చి 2026లో విడుదలైన సీక్వెల్ "ధురంధర్: ది రివెంజ్" ప్రపంచవ్యాప్తంగా రూ. 1,800 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది. అయితే, ఈ గ్రామీ సమర్పణలు కేవలం పరిశీలన కోసం మాత్రమేనని, ఇవి నామినేషన్లను నేరుగా ఖాయం చేయవని నిర్వాహకులు తెలిపారు. రికార్డింగ్ అకాడమీ అర్హత ప్రమాణాలను పూర్తి చేసుకుని, ఓటింగ్ ప్రక్రియను దాటిన తర్వాతే అసలు నామినేషన్లు ప్రకటిస్తారు.

## వైఫల్యాలు వస్తే కెరీర్ ముగిసినట్లా? నెటిజన్ పోస్ట్‌పై మండిపడ్డ ఆది సాయికుమార్



సినీ రంగంలో ప్రతి ఒక్కరి ప్రయాణం వెనుక ఎంతో కఠిన శ్రమ, సంఘర్షణ దాగుంటాయని టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా కొంతమంది నెటిజన్లు హీరోల కెరీర్‌పై చేస్తున్న తప్పుడు ప్రచారాలు, వ్యంగ్య కామెంట్స్‌పై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్లాపులు వచ్చినంత మాత్రాన ఎవరి కెరీర్ ముగిసిపోయినట్లు కాదని, ప్రతి నటుడి ప్రయాణంలోనూ ఎన్నో ఒడుదొడుకులు సహజంగానే ఉంటాయని ఆయన హితవు పలికారు. సెలబ్రిటీల ఫాలోయింగ్‌పై ఓ నెటిజన్ పెట్టిన ప్రతికూల పోస్ట్‌కు ఆది సాయికుమార్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి ప్రతి హీరో ఎంతో కష్టపడతారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా తన తండ్రి (సాయికుమార్) పడిన ఇబ్బందులను, అలాగే మాస్ మహారాజా రవితేజ ప్రారంభ రోజుల్లో ఎదుర్కొన్న సవాళ్లను ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా తీరుపై ఆది ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా రంగాన్ని వేడుకలా ఆస్వాదించాల్సిన సోషల్ మీడియా వేదికలు.. నేడు అభిమానుల మధ్య అనవసరమైన యుద్ధాలు, కుమ్ములాటలకు అడ్డాగా మారుతున్నాయని విమర్శించారు. ఎదుటివారిని కించపరిచేలా ట్రోల్స్ చేయడం మానేసి, వారిని గౌరవించడం మరియు ప్రోత్సహించడం నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సినీ పరిశ్రమలో జయాపజయాలు కేవలం ఒక భాగం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.

## నెట్‌ఫ్లిక్స్‌లో భారీ ఉద్యోగాల కోత.. 5 శాతం సిబ్బందిని తొలగించేందుకు సన్నాహాలు

ప్రముఖ ఓటీటీ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో ఉద్యోగాల కోతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. కంపెనీలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 5 శాతం మందిని తొలగించాలని యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది. దీనికి సంబంధించి వచ్చే వారంలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ వార్తలపై నెట్‌ఫ్లిక్స్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.ప్రస్తుతం మార్కెట్‌లో పోటీ విపరీతంగా పెరిగిపోవడంతో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార విధానాల్లో మార్పులు చేస్తోంది. యూట్యూబ్ వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌ల నుంచి తీవ్ర పోటీ ఎదురుకావడంతో, కంపెనీ తన వ్యూహాలను మార్చుకుంటోంది. ఇందులో భాగంగానే ఖర్చులను నియంత్రించుకోవడానికి ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఆదాయాన్ని పెంచుకునేందుకు లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ మరియు ప్రకటనల ఆధారిత ప్లాన్లపై నెట్‌ఫ్లిక్స్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. గతంలో 2022లో కూడా సబ్‌స్క్రైబర్ల సంఖ్య తగ్గడం, వ్యాపార వృద్ధి మందగించడం వల్ల నెట్‌ఫ్లిక్స్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. గతేడాది చివరి నాటికి ఈ సంస్థలో సుమారు 16 వేల మంది పూర్తికాలపు ఉద్యోగులు సేవలందిస్తున్నారు.




Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma